# సీఎస్ఈకి ఎందుకీ గిరాకీ?

**తెలుగు రాష్ట్రాల్లో బీటెక్/ బీఈలో చేరే విద్యార్థుల్లో అత్యధికులు ఎంచుకుంటున్న బ్రాంచి- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ). ప్రస్తుతం దీనికున్న గిరాకీ మరే ఇతర బ్రాంచీకీ లేదు. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ప్రక్రియల్లో సమాచార వ్యవస్థల డిజైన్, అమలు, నిర్వహణకు సంబంధించిన కోర్సు సీఎస్ఈ. దీనిలో చేరితే ప్రోగ్రామింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్, డేటా స్ట్రక్చర్స్ లాంటి అంశాల్లో పరిజ్ఞానం లభిస్తుంది. ఈ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేసి ఐటీ పరిశ్రమ, సంబంధిత రంగాల్లోని వివిధ ఎంట్రీ స్థాయి ఉద్యోగాల్లో ప్రవేశించవచ్చు!**

ఆన్‌లైన్‌లో తగినన్ని వనరులు, సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రస్తుత యుగంలో విద్యార్థులకు సీఎస్ఈ చాలా కీలకం. రోజురోజుకూ ఆటోమేషన్, నాన్-మాన్యువల్ పనుల అవసరం పెరుగుతోంది. అధునాతన సాంకేతికత మానవ జీవితాన్ని సులభతరం చేస్తోంది. విద్యార్థులు సాధారణంగా కంప్యూటర్లు, మొబైల్ పరికరాల్లో గేమ్స్ ఆడుతున్నపుడూ, వనరులు శోధిస్తున్నపుడూ పొందిన అనుభవాల నుంచి ఎంతో నేర్చుకుంటున్నారు. ఆధునిక పరికరాల అభివృద్ధికి కంప్యూటర్ల పూర్తి/పాక్షిక వినియోగం తెలిసి ఉండాల్సిందే. సీఎస్ఈ రంగంలో అధిక పోటీ ఉన్నప్పటికీ ఈ కారణంగా.. మెరుగైన కెరియర్ అవకాశాలు లభిస్తున్నాయి.

కంప్యూటర్ సైన్స్- ఇంజినీరింగ్ అనేది అత్యంత క్రియాశీలకమైన రంగం. ఇక్కడ సంవత్సరం పొడవునా కొత్త టెక్నాలజీలను ప్రవేశపెడుతుంటారు. ఈ రంగంలో పరిశోధన, అభివృద్ధి పరిధిలో నైపుణ్యం పెరిగే అవకాశం ఉంది. ప్రపంచ స్థాయి సమస్యలకు గణన పరిష్కారాలు ఎలా ఉంటాయో అన్వేషించవచ్చు. విద్యార్థులు నిత్యజీవిత సమస్యలను పరిష్కరించడానికి ఎన్నో అల్గారిథమ్‌లు, విధానాలను ఉపయోగించవచ్చు.

అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ మొదలైన టెక్ దిగ్గజాలు ఈ రంగంలో విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు, ఇంటర్న్‌షిప్‌ల పరంగా అనేక అవకాశాలను ఇస్తున్నాయి. కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్లు ఇతర విభాగాలతో సమర్థంగా కలుస్తాయి. కాబట్టి ఇంటర్ డిసిప్లినరీ సొల్యూషన్లు విస్తృత పరిధిలో ప్రభావశీలంగా పనిచేస్తాయి.

### అవకాశాలు అపారం

ప్రస్తుతం అన్ని రంగాల్లో కంప్యూటర్ సైన్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇంజినీరింగ్ కళాశాలల్లో పెరుగుతోన్న ప్లేస్‌మెంట్లే దీనికి నిదర్శనం. ఇప్పుడున్న పరిశ్రమల్లో అధునాతన వ్యవస్థలు, ఆటోమేషన్ పురోగతి సీఎస్ఈ రంగం గిరాకీని పెంచుతోంది. ఈరోజుల్లో మనం ఉపయోగించే ప్రతి అప్లికేషన్‌లో డేటా ప్రధాన అంశం. సీఎస్ఈ అనేది డేటా సైన్స్, ఎంఎల్ అనుబంధిత సబ్‌డొమైన్లతో కూడిన పెద్ద డొమైన్. ఏఐ, బ్లాక్‌చెయిన్ లాంటి అధునాతన టెక్నాలజీలు ప్రపంచ రూపురేఖలను మారుస్తున్నాయి. ప్రతి రంగంలో కంప్యూటర్ల వినియోగం ఉన్నందున సీఎస్ఈకి ఎంతో ప్రఖ్యాతి లభిస్తోంది.

క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విజువల్ రియాలిటీ అండ్ ఆగ్‌మెంటెడ్ రియాలిటీ లాంటి డొమైన్‌లలో ఎంతో సాంకేతిక పురోగతి వస్తోంది. కాబట్టి సీఎస్ఈ డొమైన్‌లో అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. సీఎస్ఈ గ్రాఫ్ ఎప్పుడూ పెరుగుతూనే ఉండటం వల్ల ఈ రంగంలో అవకాశాలు విస్తృతమవుతున్నాయి.

ప్రపంచ టెక్ దిగ్గజాలు అయిన మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఐబీఎం లాంటివి ఎంతోమంది యువతకు అవకాశాలు కల్పిస్తున్నాయి. మనదేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో టెక్నాలజీకి తారస్థాయిలో క్రేజ్ ఉన్నందువల్ల సీఎస్ఈ విద్యార్థులు తమ నైపుణ్యాలతో లభిస్తున్న అవకాశాలను రెండు చేతులా అందిపుచ్చుకుంటున్నారు. సీఎస్ఈ కోర్సుల్లో పోటీతత్వం ఉన్నప్పటికీ అవకాశాలు కూడా అదే క్రమంలో పెరుగుతున్నాయి. ఈ డొమైన్ కింద ఎన్నో అధునాతన సబ్ డొమైన్‌లున్నాయి. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ లాంటి అధునాతన సాంకేతికతలు పెరుగుతూ అవకాశాలు కూడా భారీగా వృద్ధి చెందుతున్నాయి.

**- డా. మధుబాబు చుండూరి**
హెచ్ఓడీ, సీఎస్ఈ, బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

### పట్టు సాధిస్తేనే...

కంప్యూటర్ సైన్స్- ఇంజినీరింగ్ అనేది సాహసోపేతమైన రంగంగా చెప్పవచ్చు. దీనిలో ప్రతి త్రైమాసికంలో వినూత్నమైన సాంకేతికతలను ప్రవేశపెడతారు. విద్యార్థులు వీటిని అభ్యసించి వాటిపై పట్టు సాధిస్తేనే ముందంజలో ఉంటారు.

ఈ బ్రాంచిలో ప్రధానమైన అంశం 'ప్రోగ్రామింగ్'. దీన్ని వ్యావహారికంగా 'కోడింగ్' అంటారు. ముందుగా ఈ కోడింగ్ భాషలపై విద్యార్థులు పరిచయ కోర్సులు చదివి, తగినంత పట్టు సాధించాలి. ఈ అభ్యాసం వారిని సులువుగా కోడ్ చేయడానికి వీలు కల్పిస్తుంది. దీంతో వారు ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగలుగుతారు. కోడింగ్‌లో అంతిమ విజయం సాధించడానికి కావల్సింది 'స్థిరమైన అభ్యాసం'. కోడింగ్‌లో ఆలోచన దశ సమయం తీసుకుంటుంది. లాజిక్ బిల్డింగ్ తర్వాత నిర్ణయించిన లాజిక్‌కు సరిపోయే కోడ్‌ను కనుక్కోవడం చాలా సులభం. చివరి భాగం కోసం ప్రోగ్రామింగ్ నిర్మాణాలు స్పష్టంగా తెలుసుకోవాలి.

కాబట్టి మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు భౌతికంగా, ఆన్‌లైన్ కోడింగ్ పోటీల్లో పాల్గొనడంపై శ్రద్ధ చూపాలి. కోడ్‌షెఫ్, కోడ్‌ఫోర్స్, లీట్‌కోడ్ మొదలైనవి విద్యార్థుల ఆలోచనా సామర్థ్యాన్నీ, కోడింగ్ నైపుణ్యాన్నీ పెంచుతాయి. కోడింగ్‌లో విజయం సాధించడానికి ఇదొక అవకాశం.

హ్యాకథాన్ అనేది మరో అంశం. ఇక్కడ విద్యార్థులు బృందాలుగా ఏర్పడి కంప్యూటర్ పరిష్కారాలను రూపొందించాలి. ఇది విద్యార్థుల్లో పని వాతావరణాన్ని కల్పిస్తుంది. కొత్త కొత్త పరిష్కారాలు తీసుకురావడానికీ, నూతన సాంకేతికతకూ సాధనాల ఆవిష్కరణ జరుగుతుంది. కోడెథాన్, ఐడియాథాన్ వీటికి మరో రూపాలు. ఇవి విద్యార్థుల తెలివితేటలనూ, సమస్యల పరిష్కార పద్ధతులనూ, ఆలోచనా సామర్థ్యాలనూ పరీక్షిస్తాయి. విద్యార్థులు నెట్‌వర్కింగ్ ప్రయోజనాల కోసం, పరిజ్ఞానం, నైపుణ్యాలు పంచుకోవడం కోసం, కాన్ఫరెన్స్‌లు, సమ్మిట్‌లూ మొదలైన అవకాశాల కోసం వెతకవచ్చు.

అధ్యాపకులు తమ విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడానికి ప్రత్యేక ల్యాబ్‌లను ఏర్పరిచి ఇష్టమైన డొమైన్‌లలో శిక్షణ ఇప్పించాలి. ఆసక్తి కలిగిన విషయ పరిశోధనల్లో పత్రాలు రాయడానికి ప్రోత్సహించాలి. పేటెంట్లు, ఫెలోషిప్‌లు, ప్రాజెక్ట్ ఫండింగ్ మొదలైన వాటికోసం దరఖాస్తులను మెరుగుపరుచుకోవాలి. ఐడియాథాన్లు, టీహబ్, టాస్క్ లాంటి స్టార్టప్ ఇంక్యుబేషన్లు అవకాశాలకూ, విద్యార్థుల కెరియర్ మెరుగుపరచడానికీ ఎంతో ఉపయోగపడతాయి.

## నోటిఫికేషన్స్

### ప్రవేశాలు

#### వైద్య కళాశాలల్లో పారామెడికల్ కోర్సులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ (ఏపీఎస్ఏహెచ్‌పీసీ)...వివిధ పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో మొత్తం 18,307 సీట్లు ఉన్నాయి.
★ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ ★ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ ★ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ★ డయాలసిస్ టెక్నాలజీ ★ రెస్పిరేటరీ థెరపీ ★ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ ★ పెర్‌ఫ్యూజన్ టెక్నాలజీ ★ ఆప్టోమెట్రిక్ టెక్నీషియన్ ★ రేడియో థెరపీ టెక్నీషియన్ ★ రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్ ★ డార్క్ రూమ్ అసిస్టెంట్ కోర్సు ★ కార్డియాలజీ టెక్నీషియన్ కోర్సు ★ డిప్లొమా ఇన్ క్యాత్ ల్యాబ్ టెక్నాలజీ ★ డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ కోర్సు ★ డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్ కోర్సు ★ డిప్లొమా ఇన్ మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెంట్- మేల్
**అర్హత:** ఇంటర్మీడియట్ బైపీసీ ఉత్తీర్ణులై ఉండాలి.
**వయసు:** వయసు 16 ఏళ్లు నిండి ఉండాలి.
**వ్యవధి:** రెండేళ్లు. ఇంగ్లిష్ మీడియంలో బోధన.
**ఎంపిక:** బైపీసీ విద్యార్థులు లేకుంటే.. ఎంపీసీ విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ రెండు గ్రూపు విద్యార్థులు లేకుంటే ఇతర గ్రూపు విద్యార్థులకు ప్రవేశం కల్పించే అవకాశం ఉంది. సీట్లను ప్రభుత్వ రిజర్వేషన్ల మేరకు ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారు.
**దరఖాస్తు:** ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వెబ్‌సైట్ సూచించిన దరఖాస్తు నమూనాను పూర్తి చేసి సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ చిరునామాకు పంపాలి. ప్రైవేటు పారామెడికల్ కళాశాలల్లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత జిల్లా వైద్యారోగ్య అధికారికి, కార్యాలయం చిరునామాకు పంపాలి.
**దరఖాస్తు ఫీజు:** రూ.100.
**ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 24-07-2023.
**కౌన్సెలింగ్ నిర్వహణ, అభ్యర్థుల కేటాయింపు:** 01-08-2023.
**తరగతులు ప్రారంభం:** 01-09-2023.
**వెబ్‌సైట్:** apsahpc.co.in

#### కాళోజీ వర్సిటీలో ఎంబీబీఎస్, బీడీఎస్

తెలంగాణలోని ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశాలకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది.
**అర్హత:** ఇంటర్మీడియట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/ బయోటెక్నాలజీ) తో పాటు నీట్ యూజీ-2023లో నిర్ణీత స్కోరు.
**వయసు:** 31-12-2023 నాటికి 17 సంవత్సరాలు నిండిపుండాలి.
నీట్ యూజీ-2023లో కటాఫ్ స్కోర్:
జనరల్ కేటగిరీ(ఈడబ్ల్యూఎస్‌తో సహా): 137
ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ కేటగిరీ: 107
దివ్యాంగులు(ఓసీ): 121
**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** 14-07-2023.
**వెబ్‌సైట్:** https://www.knruhs.telangana.gov.in/

#### నిమ్స్‌లో హాస్పిటల్ మేనేజ్‌మెంట్

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
మొత్తం సీట్లు: 20
**కోర్సు వ్యవధి:** రెండేళ్లు, ఆరు నెలల ఇంటర్న్‌షిప్.
**అర్హత:** ఏదైనా డిగ్రీ **వయసు:** 31.12.2023 నాటికి 20-30 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 18-07-2023.
**దరఖాస్తు హార్డ్ కాపీ సమర్పణకు చివరి తేదీ:** 21-07-2023.
**హాల్ టిక్కెట్ల జారీ:** 07-08-2023.
**ప్రవేశ పరీక్ష తేదీ:** 10-08-2023. **ఫలితాల వెల్లడి:** 11-08-2023.
**వెబ్‌సైట్:** https://www.nims.edu.in/

### వాక్ ఇన్స్

#### సౌత్ వెస్టర్న్ రైల్వేలో యాక్ట్ అప్రెంటిస్‌లు

హుబ్బళ్లిలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్- సౌత్ వెస్టర్న్ రైల్వే 904 యాక్ట్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
**విభాగాలు/ వర్క్‌షాప్‌లు/ యూనిట్లు:** హుబ్బళ్లి డివిజన్, క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్(హుబ్బళ్లి), బెంగళూరు డివిజన్, మైసూరు డివిజన్, సెంట్రల్ వర్క్‌షాప్(మైసూరు).
**ట్రేడ్:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్ మెకానిక్, పీఏఎస్ఏఏ, స్టెనోగ్రాఫర్.
**అర్హత:** 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ. **వయసు:** 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.
**ఎంపిక:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కుల ఆధారంగా.
**దరఖాస్తు రుసుము:** రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.08.2023.
**వెబ్‌సైట్:** https://www.rrchubli.in/

## ఎలా సరిదిద్దుకోవాలి?

**ఫారిన్ యూనివర్సిటీ ఫెలోషిప్/ఇంటర్న్‌షిప్‌కి దరఖాస్తు చేసి ఎంపికయ్యాను. అన్నింట్లోనూ నేనే ముందుండాలనే ఆరాటంలో ఈ విషయాన్ని నా ప్రాణ స్నేహితురాలికి చెప్పలేదు. ఇప్పుడు తనతో మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోతున్నా. ఈ పొరపాటును ఎలా సరిదిద్దుకోవాలి? - వినీత**

■ మీరు ఫారిన్ ఫెలోషిప్ గురించి మీ స్నేహితురాలికి చెప్పలేదన్నారు. ఎవరితో అయినా చాలాకాలంగా ప్రయాణిస్తున్నప్పుడు, ఆ బంధాన్ని నిలుపుకోవాలంటే నమ్మకం, ఒకరిని ఒకరు పూర్తిగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా ప్రాణస్నేహితుల దగ్గర రహస్యాలుండవు. కానీ, ఆమెకు చెప్పకపోవడానికి కారణం అందరికంటే ముందుండాలన్న ఆరాటమని అంటున్నారు. అందరికంటే ముందు ఉండాలనుకోవడం, అందరం కలిసి ముందుకు వెళ్ళాలనుకోవడంలో చాలా తేడా ఉంది. వీటిలో మీరు మొదటి మార్గాన్ని ఎంచుకున్నారు. నచ్చిన ఫారిన్ ఫెలోషిప్‌ని ప్రాణ స్నేహితురాలితో కలిసి చేసే అద్భుత అవకాశాన్ని మీరు కోల్పోయారు. ముందే చెప్పకపోవడం అనేది జరిగిపోయిన విషయం కాబట్టి, ఆ విషయాన్ని ఇక్కడితో వదిలేయండి. అదే విషయాన్ని పదే పదే ఆలోచించి మనసును కష్టపెట్టుకోకండి. మనసులోని బాధ పోవాలంటే నేరుగా ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేయండి. ప్రత్యక్షంగా మాట్లాడలేకపోతే ముందుగా ఫోన్‌లోనో, మరో స్నేహితురాలి ద్వారానో తనని చేరుకొనే ప్రయత్నం చేయండి. ఎలాంటి మానసిక పరిస్థితుల్లో అలా చేయాల్సివచ్చిందో తనకు అర్థమయ్యేలా చెప్పి క్షమించమని అడగండి. తను ఈ విషయాన్ని మీరనుకున్నంత సీరియస్‌గా తీసుకోకపోవచ్చు కూడా! ఒకవేళ కోపంతో తను ఏమైనా అన్నా కూడా మీరేమీ స్పందించకుండా తనతో ఎప్పటిలాగే ఉండే ప్రయత్నం చేయండి. కావాలనుకునే బంధం నిలుపుకోవడానికి కొన్నిసార్లు ఇలాంటివి తప్పవు. ఒకవేళ, తను అర్థం చేసుకోకుండా మిమ్మల్ని దూరం పెట్టాలనుకొంటే కూడా మీరేమీ బాధ పడకుండా, భవిష్యత్తులో మరెప్పుడూ ఇలాంటి పరిస్థితులు రాకుండా చూసుకోండి.

**- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,** కెరియర్ కౌన్సెలర్

### హైదరాబాద్‌లో

#### సేల్స్ ప్రమోషన్

**సంస్థ:** సింప్లిఫై సొల్యూషన్స్
**స్టైపెండ్:** నెలకు రూ.15,000
**దరఖాస్తు గడువు:** జులై 20
**అర్హతలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, సేల్స్ అండ్ మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/9bf926

#### లీగల్ రిసెర్చ్

**సంస్థ:** జీగ్లర్ ఏరోస్పేస్
**స్టైపెండ్:** నెలకు రూ.10,000
**దరఖాస్తు గడువు:** జులై 20
**అర్హతలు:** క్లయింట్ రిలేషన్‌షిప్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం లేబర్ లాస్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/0116b7

#### బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

**సంస్థ:** రివైజ్ ట్యాక్స్
**స్టైపెండ్:** నెలకు రూ.5,000

### త్రీడీ ఇంటర్న్‌షిప్‌లు

**దరఖాస్తు గడువు:** జులై 17
**అర్హతలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, గూగుల్ వర్క్‌స్పేస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/131274

#### డిజిటల్ మార్కెటింగ్

**సంస్థ:** ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్
**స్టైపెండ్:** నెలకు రూ.20,000
**దరఖాస్తు గడువు:** జులై 20
**అర్హతలు:** అడోబ్ క్రియేటివ్ సూట్, బిజినెస్ రిసెర్చ్, కేన్వా, కాపీరైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్ నైపుణ్యాలు
☛ internshala.com/i/e3582a

# కలిసిపోతేనే 'బృందా'వనం!

## చిన్నపాటి మెలకువలతో మెరుగైన టీమ్ వర్క్

**కాలేజీలో అసైన్‌మెంట్లు, ప్రాజెక్టులు చేసేటప్పుడు.. అది పూర్తయ్యాక ఉద్యోగంలో చేరాక.. ఎక్కడైనా సరే, బృందంతో కలిసి పనిచేయడం అవసరం. అలాంటప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు, అవాంతరాలు ఎదురవుతూ ఉంటాయి. మనం సొంతంగా నచ్చినట్టు నడుచుకోవడానికి, నలుగురితోనూ కలిసి నడవడానికి చాలా తేడా ఉంటుంది. ఇటువంటి సందర్భాలను విజయవంతంగా ఎదుర్కోవాలంటే, బృందంతో కలిసి సాఫీగా పనిచేసుకోవాలంటే ఉపయోగపడే మెలకువలేంటో చూద్దామా!**

బృందంతో కలిసి పనిచేయడం ఎప్పుడూ సవాలే. ఏ టీమ్‌లో అయినా బహుశా ఏ ఇద్దరూ ఒకేలా ఆలోచించరేమో. పనితీరులోనూ, వేగంలోనూ చాలా తేడాలుంటాయి. అదే సమయంలో బలాలు, బలహీనతల్లోనూ వైరుధ్యాలుంటాయి. అయితే ఐదువేళ్లూ కలిస్తేనే పిడికిలి బలంగా బిగిసినట్టు.. నలుగురూ కలిస్తేనే బృందం బలపడుతుంది. రకరకాలైన మనస్తత్వాలు కలిగిన వారంతా ఒక్కటిగా వెళ్లగలిగితే అందరికీ అంతిమంగా లాభం చేకూరుతుంది. అందుకే ఆ టీమ్ స్పిరిట్‌ను ఎట్టి సందర్భంలోనూ కోల్పోకూడదు.

### 1 నేర్చుకోవడానికి సుముఖంగా..

కొత్తగా ఏదైనా బృందంలోకి వెళ్తున్నా, ఒకే టీమ్‌తో ఎక్కువ కాలం పనిచేసి ఇప్పుడు మారాల్సి వచ్చినా.. ఎంతోకొంత బెరుకు, ఇబ్బంది, మొహమాటం సహజం. ఒకేసారి అంతా తెలిసినట్టు సౌకర్యంగా ఉండలేకపోవచ్చు. ఇలాంటి సమయాల్లో మార్పునకు మానసికంగా సిద్ధమవడం అవసరం. 'ఇదివరకటిలా ఉండదు, ఇదంతా కొత్త' అనే భావన ముందు కల్పించుకోవాలి. కొత్తచోటు కాబట్టి అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు ప్రయత్నించాలి. అప్పటికే ఎంత అనుభవం ఉన్నా.. కొత్తగా వెళ్లినప్పుడు నేర్చుకోవడానికి సుముఖంగా ఉండటమే మంచిది. హాయిగా రిలాక్స్ అవుతూ కొత్తదనాన్ని ఆస్వాదించడం ద్వారా టీమ్‌ను అర్థం చేసుకునే అవకాశం దక్కుతుంది.

### 2 గమనించడం ద్వారా..

ఎక్కడైనా సరే తెలుసుకోవడానికీ, నేర్చుకోవడానికీ చేసే ప్రయత్నం మంచి ఫలితాలనే ఇస్తుంది. కొంతకాలంపాటు బృందంలో సభ్యులను, బృంద లక్ష్యాలను, వాటిని అందుకోవడంలో ఎవరి పాత్ర ఏంటి అనేదాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించడం మంచిది. వీలైనంత గమనించడం ద్వారా వీటిని గుర్తించవచ్చు. అలాగే మీ గురించి వారు తెలుసుకునే అవకాశం ఇవ్వడం కూడా అవసరం. దీనివల్ల మీరు సానుకూలంగా, అరమరికలు లేకుండా ఉన్నారనే భావన ఎదుటివారికి కలుగుతుంది. మీకున్న ఇష్టాలు, ఆసక్తులు బృందంలో ఇంకెవరికైనా కూడా ఉంటే వాటిపై దృష్టి పెట్టడం ద్వారా వారితో కలిసిపోవడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. త్వరగా మిత్రులు అవ్వగలరు.

### 3 నిజాయతీగా..

బృందంతో నిజాయతీగా ఉండటం వల్ల మీకే కాదు.. పనికీ మంచిది. ఒకరి విషయాలు మరొకరి వద్ద మాట్లాడకపోవడం.. ఎవరైనా నమ్మి తమ అభిప్రాయాలు వెల్లడిస్తే వాటిని మనసులోనే ఉంచుకోవడం ద్వారా వారి నమ్మకాన్నీ, స్నేహాన్నీ గెలుచుకోగలం. నిజాయతీగా ఉన్నప్పుడే బంధాలు వికసిస్తాయనేది జీవితంలోనే కాదు, బృందంతోనూ పాటించాల్సిన సూత్రం. అధికారుల వద్ద, కంపెనీ నుంచి మెప్పు కోసం టీమ్‌ను ఇబ్బందిపెట్టడం సరికాదనే విషయాన్ని గమనించాలి.

### 4 కొత్తలో కొంత..

మొదటి నుంచే ఇతరులతో సాగించే సంభాషణల్లోనూ, సమావేశాల్లోనూ మరీ ఎక్కువ స్థిరంగా, దృఢంగా కనిపించకపోవడం ఉత్తమం. దానివల్ల మీది 'మొండి పట్టుదల' అనే ముద్ర పడే ప్రమాదం ఉంది. కొత్తలో కొన్ని విషయాలు మనకు వేరేవిధంగా అనిపించినా కొంతవరకూ ఎదుటివారికి స్పేస్ ఇవ్వడం మంచిది. కొంతకాలం ఆగి, తర్వాత మన అభిప్రాయాలను ఎంత దృఢంగా తెలియజేసినా.. ఈలోగా బృందంతో మంచి సంబంధాలు ఏర్పడటం వల్ల వారు సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో అపార్థాలకు తావుండదు. కొన్నిసార్లు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పరివారంతో చిన్న చిన్న తేడాలు వచ్చే ప్రమాదం లేకపోలేదు. అలాంటప్పుడు స్నేహపూర్వక వాతావరణంలో వాటిని చక్కదిద్దుకుంటే దీర్ఘకాలంలో మంచి ఫలితాలు పొందవచ్చు.

### 5 మాట్లాడే స్వేచ్ఛ

బృందంలో పనిచేసేటప్పుడు ఎవరు దేన్ని ఎలా తీసుకుంటారో అనే భయంతో చాలామంది తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పరు. అలాకాకుండా మాట్లాడేటప్పుడు మనం కొంచెం ఫ్రీగా ఉన్నట్లు కనిపిస్తే ఇతరులు తమ ఆలోచనలను మనతో స్వేచ్ఛగా పంచుకోగలుగుతారు. విభిన్నమైన అభిప్రాయాలను, విమర్శలను తీసుకోగలిగినప్పుడే బృందంలో ఇమిడిపోగలం అనే విషయాన్ని గుర్తించాలి. మంచైనా చెడైనా ముందు ఇతరులు చెప్పేదేంటో పూర్తిగా వినడం, ఆ తర్వాతే స్పందించడం, అది కూడా పని వాతావరణానికి సరిపోయే స్థాయిలో మాత్రమే కావడం అవసరం. అలా లేకపోతే మనతో ఎవరు ఏది చెప్పాలన్నా ఆలోచించి వెనకడుగేసే ప్రమాదం ఉంటుంది.

### 6 కొంత సరదా

మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్.. ఉల్లాసంగా ఉండటం పని ప్రదేశాన్ని, చేసే పనిని ఉత్తేజితం చేస్తుంది. అందువల్ల ఎప్పుడూ సీరియస్‌గా పనిలో మునిగిపోవాల్సిన అవసరం లేదు. అప్పుడప్పుడూ టీమ్‌తో సరదాగా గడపడం వల్ల వారితో చక్కగా కలిసిపోవచ్చు. ఇలా సందర్భానుసారం రిలాక్స్ కావడంతో పనిలో మరింత వేగం పెరుగుతుంది. బృందంతోనూ చక్కని సంబంధాలు ఏర్పడతాయి.

### ఇంకా..

మనకు పూర్తిగా నియంత్రణ ఉన్న పనులు, బాధ్యతల గురించి మాత్రమే ఆలోచించడం ద్వారా అనవసర విషయాలపై శ్రద్ధ పెట్టి ఇబ్బంది పడకుండా ఉండొచ్చు. ఇది మరింత ప్రొఫెషనలిజం దిశగా మన ప్రయాణాన్ని నడిపిస్తుంది. పని ప్రదేశం మారుతున్నప్పుడు కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిపై దృష్టి పెట్టడం ద్వారా దొరికిన కాస్త ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. అలాగే వర్క్ ప్లేస్‌లో ఉత్పాదకత పెరగడానికి.. టీమ్‌తో మరింత కనెక్ట్ అవ్వడానికి సోషల్ మీడియానూ ఉపయోగించుకోవచ్చు.